సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

విజ్ఞాన యాత్రకు కేవీ విద్యార్థులు



బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్

సింథియా: విజ్ఞాన సముపార్జనలో భాగంగా నౌసేనాబాగ్‌లోని కేంద్రీయ విద్యాలయం–1 విద్యార్థులు మంగళవారం విజ్ఞాన యాత్రకు వెళ్లారు. ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్ మైంగి సూచనల మేరకు నగరంలోని కేంద్రీయ మత్స్య పరిశోధన సంస్థతో పాటు జీవ వైవిధ్య ఉద్యానవనాన్ని సందర్శించారు. క్షేత్ర సందర్శనకు వెళ్లిన విద్యార్థులు వైజ్ఞానిక నమూనాలను, వివిధ రకాల మొక్కలు, చాలా అరుదుగా కనిపించే వృక్ష జాతులను తిలకించారు. వాటి పూర్వపరాల గురించి అక్కడి నిర్వాహకులు విద్యార్థులకు వివరించారు.

నేడు ఆసరా లబ్ధిదారులతో సమావేశం

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు నక్కవానిపాలెం మైదానంలోబుధవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ ఆసరా ద్వారా లబ్ధిదారులతో వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో జీవీఎంసీ 40, 58, 59, 60, 61, 62, 63వ వార్డులకు డ్వాక్రా అక్కచెల్లెమ్మలు పాల్గొనున్నారు.అలాగే ఆయా వార్డులకు చెందిన కార్పొరేటర్లు, గృహసారథులు, కన్వీనర్లు హాజరుకానున్నారు.


జోడుగుడుల అమ్మవార్ల పరస

జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం గ్రామదేవతలు కుంచుమాంబ,దుర్గమాంబ అమ్మవార్ల జాతర (పరస) బుధవారం జరగనుంది. వేకువజాము నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు. సాయంత్రం శ్రీహరిపురం పరిసర ప్రాంతాల్లో డ్యాన్స్ బేబీ డ్యాన్స్, ఆర్కెస్ట్రా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

గాయని సాహితికి వేటూరి పురస్కారం

డాబాగార్డెన్స్: వర్ధమాన సినీ నేపథ్య గాయని సాహితికి వేటూరి యువ గాయని పురస్కారం ప్రదానం చేయడం అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. సినీ గేయ రచయిత వేటూరి 98వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆత్రేయ స్మారక కళాపీఠం 'ఎదలో మోహన లాహిరి' శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ వేటూరి పేరిట పురస్కారానికి సాహితీ ఎంపిక కావడం హర్షనీయమన్నారు. అనంతరం శంబర జోగారావు సారథ్యంలో నిర్వహించిన సంగీత విభావరిలో సాహితీ, రమేష్ పట్నాయక్ ఆలపించిన వేటూరి గీతాలు అలరించాయి. గంటి మురళి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విజయనగరం కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అవనాపు విజయ్, పైడా కృష్ణ ప్రసాద్, ఉసిరికాయల చంద్రశేఖర్, సుహాసిని ఆనంద్, దాడి సత్యనారాయణ, కళా సంస్థల అధినేతలు చెన్నా తిరుమలరావు, ఎన్ఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అంగన్‌వాడీ.. నూతన ఒరవడి

- వైఎస్సార్ సంపూర్ణ పోషణతో బలవర్ధకమైన ఆహారం
- గర్భిణులు, బాలింతలకు ఇంటికే రేషన్
- ప్రీ స్కూళ్లతో ఇంగ్లిష్ మీడియంకు పటిష్టమైన పునాది



బుచ్చిరాజుపాలెం అంగన్‌వాడీ కేంద్రం



గణేష్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సరకులు పంపిణీ చేస్తున్నకార్యకర్త



చిన్నారులకు భోజనం తినిపిస్తున్న ఆయా

మొన్నటి వరకూ అంగన్‌వాడీ కేంద్రాలంటే గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేవి మాత్రమే. నిర్వహణ కూడా అంతంత మాత్రంగానే ఉండేది. అలాంటి అంగన్‌వాడీ కేంద్రాల ప్రాధాన్యం మారింది. చిన్నారుల బంగారు భవితకు అంగన్‌వాడీల్లో పటిష్ట పునాదులు పడుతున్నాయి. వారు ఆరోగ్యంగా ఎదగడానికి ఓ వైపు పౌష్టికాహారం అందిస్తూనే విద్యా పరంగా సిద్ధం చేస్తున్నారు. ఇంగ్లిష్ మీడియం చదువులకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే బాటలు వేస్తున్నారు.

విశాఖ విద్య: విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో 64 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల నిర్వహణపై స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. కేంద్రాల ద్వారా అందిస్తోన్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కిట్లు మాతా– శిశు సంరక్షణకు ఎంతో దోహదపడుతుంది. 3 నుంచి 6 సంవత్సరాల మధ్య పిల్లలకు ప్రీ ప్రైమరీ విద్య అందిస్తున్నాయి. దీంతో అంగన్‌వాడీల్లోనే ఇంగ్లిష్ మీడియం చదువుకు అవసరమైన ఫ్లాట్‌ఫాం వేస్తున్నారు. ఇందుకు అంగన్‌వాడీ కార్యకర్తలను సిద్ధం చేస్తున్నారు. కేంద్రాలకు అవసరమైన మెటీరియల్ అందించడంతో పాటు కార్యకర్తలకు తగిన శిక్షణ ఇస్తున్నారు.

బలవర్ధకమైన ఆహారం

ప్రీ స్కూళ్ల నిర్వహణలో భాగంగా కేంద్రాలకు వచ్చే 3 నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారులకు రుచికరమైన పౌష్టికాహారం వండిపెడుతున్నారు. అంతే కాకుండా గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపం, రక్తహీనత నివారించాలనే లక్ష్యంతో 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ్' పథకం ద్వారా వివిధ రకాల ఆహార వస్తువులను ఇంటికే పంపిణీ చేస్తున్నారు. నెలలో రెండు సార్లు సరకులు అందజేస్తున్నారు. ఫేజ్ వన్‌లో భాగంగా ప్రతి ఒక్కరికీ మూడు కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అరకేజీ మంచి నూనె, రెండున్నర లీటర్లు పాలు, 13 గడ్లు, 2 కేజీల రాగిపిండి, కేజీ అటుకులు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల వేరుశనగ చిక్కీ, 250 గ్రాముల ఎండు ఖర్జూరం అందిస్తున్నారు. అదే విధంగా రెండో ఫేజ్‌లో రెండున్నర లీటర్ల పాలు, 12 గుడ్లు పంపిణీ చేస్తున్నారు.

కేంద్రాల నిర్వహణకు నిధులు

అద్దె భవనాల్లో నిర్వహించే కేంద్రాలకు ఇటీవల వరకు నెలసరి అద్దె మంజూరు చేశారు. కాగా కమ్యూనిటీ హాల్స్(రెంట్ ఫ్రీ), సొంతభవనాలు ఉన్న కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు పెంపొందించేందుకు సైతం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నాడు–నేడులో భాగంగా నియోజకవర్గంలోని 27 కేంద్రాలకు రూ.22.01 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో అవసరమైన కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుదీకరణ, సుందరంగా తీర్చిదిద్దేలా రంగులు వేయనున్నారు.

ఎంతో ఉపయోగం



మా ఆయన ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా పని చేస్తున్నారు. ఆ ఆదాయంతోనే కుటుంబ అవసరాలు తీరేది. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ఇస్తున్న ఆహార పదార్థాలు మాలాంటోళ్లకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. గర్భిణిగా ఉన్నప్పటి నుంచి ఇంటికి సరకులు ఇస్తున్నారు. ఇప్పుడు మా పాపకు 17 నెలలు వచ్చాయి. గుడ్లు ప్రతీ రోజూ ఉడికించి ఇస్తున్నాను. కబురు పెట్టి మరీ అంగన్‌వాడీ టీచర్ సరకులు ఇస్తుంటారు.

– జి.పూర్ణిమ, ఓల్డ్ కరాస,52వ వార్డు

మెరుగైన సేవలు



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు అందించేలా దృష్టి సారించాం. కేంద్రాల కార్యకర్తల పట్ల ప్రభుత్వం ఎంతో సానుకూలంగా ఉంది. డిసెంబర్ వరకు అద్దె బకాయిలు ఇటీవలనే చెల్లించాం. అన్ని రకాల సమస్యలను పరిష్కరించే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రీ స్కూళ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– ఎం.వి. రమణకుమారి, సీడీపీవో, విశాఖ అర్బన్

ఓటరు జాబితాలు పరిశీలించుకోవాలి

ఆర్డీవో హుస్సేన్ సాహెబ్



మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

విశాఖ విద్య: ఓటరు జాబితాలను ప్రతి ఒక్కరూ పరిశీలించుకునేలా రాజకీయ పార్టీలు సహకరించాలని పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ కోరారు. గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీలు, నియోజకవర్గంలోని మండలాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అర్హులైన ఓటర్లతో కూడిన తుది జాబితాను ప్రకటించడం జరిగిందన్నారు. ఓటరు జాబితాలు పోలింగ్ స్టేషన్లతోపాటు సచివాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఓటర్లు అంతా తమ పేరు జాబితాలో ఉందా, లేదో పరిశీలించుకోవాలన్నారు. ఈ విషయంలో అందరికీ తెలిసేలా రాజకీయ పార్టీల నాయకులు కూడా సహకరించాలన్నారు. ఓటరు జాబితాలో ఒక వేళ పేరు లేర పోతే అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. సమావేశంలో ఎన్నికల సెల్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ బీఎస్పీ అభ్యర్థిగా రామచంద్రరావు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన అతుకుమిల్లి రామచంద్రరావును బీఎస్పీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా ఖరారు చేస్తూ మంగళవారం ఆ పార్టీ పెద్దలు ధ్రువీకరణ పత్రం అందించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



బంతి, చామంతుల అలంకరణలో కొత్తమ్మతల్లి



విశేష అలంకరణలో రాస పోలమాంబ

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట గ్రామదేవత కొత్తమ్మతల్లిని మంగళవారం బంతి, చామంతి, గజమాలలతో అలంకరించారు. రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో జీరు వాసురెడ్డి ఆర్థిక సహకారంతో అలంకరణ పూర్తి చేశారు. ఈ అలంకరణకు భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతోపేటకు చెందిన దుంప శంకరరావు సహకారం అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారి సేవలో ఉంటున్న పోతల నరసయ్యమ్మకు వెంపాడ వెల్ఫేర్ సొసైటీ, ఓఎస్‌జీ ఫౌండేషన్ సహకారంతో ఆలయ కమిటీ ప్రతినిధులు బియ్యం, నిత్యావసర సరకులు అందించారు.

- భీమిలి మండలం మజ్జివలస కూడలిలోని రాస పోలమాంబ అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు 9 రకాల పువ్వులు, తులసిమాలలతో అలంకరించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

విశాఖ ఉక్కులో పరిస్థితులు ఆందోళనకరం



ఐక్యత చాటుతున్న కార్మిక సంఘాల నాయకులు

గాజువాక: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో పరిస్థితులు నానాటికీ ఆందోళనకరంగా మారుతున్నాయని స్టీల్‌ప్లాంట్ నాన్ జేసీఎం కార్మిక సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గాజువాకలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాన్ జేసీఎం సభ్యుడు డి.వి.రమణారెడ్డి మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మూడేళ్లుగా పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోగా, ఒక్కొక్క విభాగాన్ని ప్రైవేటీకరిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో రిక్రూట్‌మెంట్ జరగడంలేదని, కార్మికుల సంఖ్య కూడా తక్కువగా ఉందని పేర్కొన్నారు. నిర్వాసితుల కోటా కూడా ఇవ్వడంలేదన్నారు. వివిధ కారణాలను చూపించి కార్మికులను తొలగించడం సరి కాదన్నారు. మరోపక్క కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు దెబ్బ తింటున్నాయన్నారు. ఈ సమస్యలపై ప్రధాన కార్మిక సంఘాలు స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఈ అంశాలపై 16 కార్మిక సంఘాల తరఫున తాము ప్రశ్నిస్తే తమపై నిందలు వేస్తున్నారన్నారు. ఆర్థిక ప్రయోజనాలపై కార్మిక సంఘాలు ఏమీ చేయని కారణంగా కార్మికవర్గం తీవ్ర అసంతృప్తితో ఉందన్నారు. ప్రధాన సంఘాలు స్పందించకపోయినా తమ శక్తిమేరకు పోరాడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గణపతిరెడ్డి, కొమ్మినేని శ్రీనివాసరావు, నక్కా వెంకట రమణ, గుమ్మడి నరేంద్ర, మహాలక్ష్మి నాయుడు, లక్ష్మణ్, డేవిడ్, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన రూర్కెలా విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఎన్ఐటీ రూర్కెలా విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ అట్మాస్ఫియరిక్ సైన్స్ కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థులు మంగళవారం సందర్శించారు. పురాతనమైన వాతావరణ–సముద్ర అధ్యయన శాస్త్ర విభాగంలో ఉన్న మౌలిక వసతులు, ప్రాజెక్టులు, మొబైల్ పొల్యూషన్ టెస్టింగ్ పరికరాలను ప్రత్యక్షంగా తిలకించారు. విభాగ ఆచార్యులతో మాట్లాడి, బోధన, పరిశోధన వసతులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన విభాగాన్ని సందర్శించడం, ఇక్కడ ప్రత్యేకతలను తెలుసుకోవడంపై ఎన్ఐటీ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల బృందం ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పి.సునీత, ఆచార్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రార్ స్టీఫెన్‌తో ఎన్ఐటీ రూర్కెలా విద్యార్థులు

మర్యాదపూర్వక కలయిక



సీఐ సన్యాసినాయుడును సత్కరిస్తున్న ట్రేడ్ యూనియన్ నాయకులు

మల్కాపురం: మల్కాపురం సీఐగా బాధ్యతలు స్వీకరించిన సన్యాసినాయుడిని పారిశ్రామిక ప్రాంత స్టీల్ సిటీ విశాఖ ఆల్ ఇండస్ట్రియల్ (కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్)యూనియన్ ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. సీఐను కలిసిన వారిలో యూనియన్ అధ్యక్షుడు నమ్మి శంకర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి బొట్ట వెంకటప్పారావు, జి.వెంకటరమణ,పవన్,రాజేష్,పల్లా సాగర్‌యాదవ్,రాజు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు తరలివచ్చారు. స్వామి సన్నిధి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

గాంధీజీ సిద్ధాంతాలు స్ఫూర్తిదాయకం



గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింథియా: గాంధీజీ సిద్ధాంతా ప్రతి ఒక్కరిలోనూ స్ఫూర్తి నింపుతాయని, గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం కోసం మనమంతా కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. వార్డు పరిధిలోని గుడివాడఅప్పన్నకాలనీ, త్రినాథపురం, ఎస్సార్ కాలనీ తదితర ప్రాంతాల్లో గాంధీజీ విగ్రహాలు, చిత్రపటాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో మహాత్మా గాంధీ విగ్రహానికి వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి వంటి మహానీయులను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక యువకులు పాల్గొన్నారు.

సినిమా సాహిత్యంతో విలువలపై అవగాహన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'దాశరథి సినీ సాహిత్యం–జనరంజక వీణానాదం'అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ముఖ్యఅతిథి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ సినిమా సాహిత్యం ఒకవైపు ఆనందాన్ని అందిస్తూనే సమాజ విలువలను తెలియజేస్తుందన్నారు. ప్రత్యేక అతిథి మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి ఆచార్య వి.శంకరరావు మాట్లాడుతూ సాహిత్యంలో అద్భుతమైన పాటలు రాసి సాహిత్యపు విలువలు పెంపొందించిన సినీ గేయ రచయత దాశరథి అని కొనియాడారు. ఎటువంటి అశ్లీలత దొర్లకుండా విలువలతో కూడిన సాహిత్యం అందించారన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న రచించిన 90వ పుస్తకం రావిశాస్త్రి రచనలు–అభ్యుదయ దృక్పథం పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావుకు అంకితం చేసినట్లు ఆచార్య సిమ్మన్న తెలిపారు. సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, డాక్టర్ ఎ.ఈశ్వరమ్మ, డాక్టర్ బి.వెంకటస్వామి, డాక్టర్ కె.రత్నశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



ఉత్తరాంధ్ర బీసీ చైతన్య వేదిక నూతన కార్యవర్గ సభ్యులు

డాబాగార్డెన్స్ : జననాయక్ కర్పూరి ఠాగూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డు ప్రకటించడంపై ఉత్తరాంధ్ర బీసీ చైతన్య వేదిక హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు మంగళవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల ఉత్తరాంధ్ర బీసీ చైతన్య వేదిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పలువురు ప్రముఖులు, బీసీలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర బీసీ చైతన్య వేదిక అధ్యక్షుడిగా పెదపెంకి శివప్రసాదరావు, వేదిక శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడిగా దాసరి జ్ఞానమూర్తి, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా ఎస్‌వీవీ రామచంద్రరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఓబీసీ నాయకుడు ఉండవల్లి శ్రీనివాసరావు, ప్రైడ్ విశాఖ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్లపూడి ఈశ్వరరావు, కణితి ఈశ్వరరావు, నాయీబ్రాహ్మణ సంఘ నగర కమిటీ అధ్యక్షుడు అతవ సుబ్బారావు, బత్రాజుల సంఘం మహిళా అధ్యక్షురాలు అనసూయ, తెలుకల సంఘం నాయకుడు వైవీ రమణమూర్తి, అనకాపల్లి జిల్లా గవర సంఘం నాయకుడు రామచంద్రరావు, గాజువాక బీసీ సవరాల సంఘం ప్రతినిధి రమేష్, సాయి కుమార్, గౌడ సామాజిక ప్రతినిధి సాయిరమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న కమిటీ నాయకురాలు దయామణి

మహారాణిపేట : వైద్య ఆరోగ్య శాఖలోని పలు విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించాలని ఏపీ నర్సు స్ట్రగుల్ కమిటీకి చెందిన నాయకురాళ్లు దయామణి, వేదవతి కోరారు. మంగళవారం జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సమావేశ మందిరంలో కమిటీ సర్వ సభ్య సమావేశం జరిగింది. నాయకురాలు దయామణి మాట్లాడుతూ వైద్య విద్య, విధాన పరిషత్, పబ్లిక్ హెల్త్, నేషనల్ హెల్త్ మిషన్‌లో దాదాపు 11,500 మంది నర్సులు కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నారని అన్నారు. తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు.